క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



మాజీ మంత్రి కాకాణితో నాగార్జున యాదవ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో పార్టీ రాష్ట్ర వలంటీర్ల విభాగం అధ్యక్షుడు నాగార్జునయాదవ్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. కాకాణి నాయకత్వంలో జిల్లాలో వలంటీర్ విభాగాన్ని బలోపేతం చేసే విధంగా పూర్తిస్థాయిలో కమిటీలు నియమిస్తున్నామన్నారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

వెంకయ్యస్వామికి ఆరాధనోత్సవాలు



నెల్లూరు(బృందావనం): మూలాపేట బ్రాహ్మణవీధిలోని గురు నిలయంలో భగవాన్ వెంకయ్యస్వామి 43వ ఆరాధన మహోత్సవాలు గురువారం భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. ఆయన ప్రియశిష్యుడు మాకాని వెంకట్రావ్ స్వామి స్వగృహంలో రెండురోజులు నిర్వహించే ఆరాధనోత్సవాల్లో తొలిరోజు సంకీర్తనతో భిక్షాటనా కార్యక్రమం నగర వీధుల్లో నిర్వహించారు. నిర్వాహకుడు మాకాని గోపిచంద్ పర్యవేక్షణలో మూలాపేట, ఫత్తేఖాన్‌పేట తదితర ప్రాంతాల్లో భిక్షాటన చేపట్టారు.

అన్నదానం



నెల్లూరు(బృందావనం): జిల్లా ప్రభుత్వాస్పత్రిలోని సత్యసాయి అక్షయ సేవా ట్రస్ట్ సదన్‌లో జెడ్పీ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో రోగుల సహాయకులకు గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ వాకర్స్ సంఘం గౌరవాధ్యక్షుడు మెట్టు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ తమ సంఘ సభ్యుడు టి.అనంతరావు, బుజ్జమ్మ దంపతుల పుట్టినరోజును పురస్కరించుకుని డీఎస్సార్ జిల్లా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో అన్నదానం చేశారు. ఎలెక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు, యు.చెంచయ్య, ఖాజామస్తాన్, వీఎస్ ప్రసాద్, వెంకటేశ్వరరెడ్డి, రాజగోపాల్, హర్షవర్ధిని, మెట్టు సుజన తదితరులు పాల్గొన్నారు.

చౌకదుకాణాలకు స్మార్ట్ మెషీన్లు

నెల్లూరు(పొగతోట): రేషన్ పంపిణీలో జాప్యం జరగకుండా స్మార్ట్ ఈ-పాస్ మెషీన్లను చౌకదుకాణాలకు అందజేశామని డీఎస్‌ఓ విజయకుమార్ అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం స్మార్ట్ ఈ-పాస్ మెషీన్లను పరిశీలించారు. పైలెట్ ప్రాజెక్టుగా నగరంలోని 174 చౌకదుకాణాలకు స్మార్ట్ ఈ-పాస్ మెషీన్లను అందజేశామన్నారు.

బైక్ చోరీ

నెల్లూరు(క్రైమ్): పల్సర్ బైక్ చోరీకి గురైన ఘటనపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. సూర్యప్రకాష్ నగర్‌కు చెందిన శ్రీనివాసులు సివిల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. ఈఏడాది జూన్ 21న ఆయన తన పల్సర్ బైక్‌ను ఏకే నగర్‌లోని ఓ స్కూల్ వద్ద పార్క్ చేశారు. పనిమిత్తం ఆయన కంపెనీ కారులో వెళ్లారు. మరుసటి రోజు వచ్చిచూడగా బైక్ కనిపించలేదు. ఈ మేరకు బాధితుడు గురువారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

హుండీ కానుకల లెక్కింపు

నెల్లూరు(బృందావనం): రంగనాయకులపేటలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో హుండీ కానుకల లెక్కింపు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ ఆళ్ల శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది మార్చి 24 నుంచి ఆగస్టు 28వ తేదీ వరకు భక్తులు కానుకల రూపంలో స్వామివార్లకు రూ.15,89,071 సమర్పించారన్నారు. పర్యవేక్షణాధికారిగా దేవదాయ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ శ్రీనివాసబాబు వ్యవహరించారు.

ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో..

మూలాపేటలోని ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో హుండీ కానుకల లెక్కింపు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ గిరికృష్ణ మాట్లాడుతూ ఈ ఏడాది మే 20 నుంచి ఆగస్టు 28వ తేదీ వరకు భక్తులు కానుకల రూపంలో అమ్మవారికి రూ.7,79,780 సమర్పించారన్నారు. అలాగే 25 అమెరికన్ డాలర్లు, రెండు సింగపూర్ డాలర్లు సమర్పించారన్నారు.

నేటి నుంచి తెలుగు భాషోత్సవాలు

నెల్లూరు(బృందావనం): పుర మందిరంలో నేటి నుంచి ఆదివారం వరకు తెలుగుభాషా ఉత్సవాలు జరగనున్నాయని 'సేవ తెలుగు భాషా, సాహితీ, సాంస్కృతిక సంస్థ' అధ్యక్షుడు కంచర్ల సుబ్బానాయుడు గురువారం తెలిపారు. గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా మూడ్రోజుల పాటు జరిగే ఉత్సవాలను శుక్రవారం ఉదయం 10 గంటలకు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రారంభిస్తారన్నారు.

జై గణేశా.. జైజై గణేశా



శివకేశవుల దేవస్థానంలో..

నెల్లూరు(బృందావనం): వినాయక చవితి సందర్భంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో భారీ గణనాథులను ప్రతిష్ఠించారు. వివిధ రూపాల్లో కొలువైన స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

⇨ బాలాజీనగర్ ఏటీఎం సెంటర్‌లో ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ దిలీప్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలను నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి నగర నేతలతో హాజరై బాలగణపతిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

⇨ బాలాజీనగర్ సెంటర్‌లో ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతిని, పాత జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుని, బారకాసు సెంటర్ వద్ద ఏర్పాటుచేసి గణనాథులను స్థానిక నాయకులతో కలిసి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి దర్శించుకున్నారు.

⇨ క్రాంతినగర్ కొండా బలరామిరెడ్డి వీధిలోని శివకేశవుల దేవస్థానం వద్ద శ్రీకృష్ణ వినాయకుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా జరిగిన పూజా కార్యక్రమాల్లో కొండా బలరామిరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, డాక్టర్ అనపల్లి సతీష్‌రెడ్డి, రమణయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు. ట్రస్ట్ చైర్మన్ దరిశిగుంట పెంచలయ్య, విజయ్, గోవిందు, నంద పాల్గొన్నారు.

⇨ నెల్లూరు(వీఆర్సీసెంటర్): 54వ డివిజన్ లక్ష్మీస్ట్రీట్‌లో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. రెండో రోజు గురువారం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



బారకాసులో గణనాథుని దర్శించుకున్న కాకాణి, పర్వతరెడ్డి



లక్ష్మీస్ట్రీట్‌లో..

మెడికవర్‌లో అరుదైన స్టెమ్ సెల్ మార్పిడి



మాట్లాడుతున్న మెడికవర్ డాక్టర్లు

నెల్లూరు(అర్బన్): నగరంలోని మెడికవర్ సూపర్ స్పెషాలిటీ కేన్సర్ ఆస్పత్రిలో తిరుపతి జిల్లాకు చెందిన ఓ వ్యక్తికి రక్త కేన్సర్‌కు అరుదైన స్టెమ్‌సెల్ ట్రాన్స్‌ప్లాంట్ చికిత్సను విజయవంతంగా నిర్వహించామని అంకాలజిస్ట్ డాక్టర్ రంగరామన్ తెలిపారు. వివరాలను ఆస్పత్రిలో ఆయన వివరించారు. వేలుమలై అనే 57 ఏళ్ల వ్యక్తి మల్టిపుల్ మైలోమా అనే రక్త కేన్సర్ చికిత్స కోసం నెల్లూరులోని మెడికవర్ ఆస్పత్రికి వచ్చారన్నారు. ఇక్కడ అన్ని పరీక్షలు చేయగా ఎముక మజ్జలోపలి కణజాలాల్లో కేన్సర్ ఉందని గుర్తించామన్నారు. అతని శరీరం నుంచి ఆరోగ్యవంతమైన మూల కణాలను సేకరించి భద్రపరిచామన్నారు. తర్వాత హైడోసు కీమో థెరపీ చేశామన్నారు. దీనివల్ల వచ్చే సైడ్ ఎఫెక్ట్స్‌కు చికిత్స చేయడంతో పాటు ఆటోలోగస్ స్టెమ్ సెల్ ట్రాన్స్ ప్లాంటేషన్ అనే అధునాతన చికిత్స అందించామన్నారు. దీనికోసం ముందుగా సేకరించిన ఆరోగ్యవంతమైన మూలకణాలు ఆయన శరీరంలోనికి ఎక్కించామన్నారు. రూ.10 లక్షల ఖర్చయ్యే వైద్యాన్ని ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా ఉచితంగా అందిస్తున్నామన్నారు. సెంటర్ హెడ్ రంజిత్‌రెడ్డి, కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ హెడ్ పవన్ పాల్గొన్నారు.

భూసేకరణను వేగవంతం చేయాలి

నెల్లూరురూరల్: జిల్లాలో అవసరమైన భూసేకరణను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో గురువారం సమావేశం నిర్వహించారు. నడికుడి- శ్రీకాళహస్తి బ్రాడ్ గేజ్ నిర్మాణానికి సంబంధించి భూసేకరణ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే భూమిని ఇచ్చిన వారికి నష్టపరిహారం వెంటనే చెల్లించాలని సూచించారు. రైలు ఓవర్ బ్రిడ్జిలు, రైలు అండర్ బ్రిడ్జిల ఏర్పాటుకు సంబంధించి పనులు వేగవంతం చేయాలన్నారు. బుచ్చి- దగదర్తి రోడ్డు, గిలకపాడు, వీరయ్యపాళెం, వినుమురులో తాగునీటి పైపులేని ఏర్పాటుపై సమీక్షించారు. బద్వేలు- నెల్లూరు హైవేకు సంబంధించి భూ సేకరణ తదితర అంశాలను చర్చించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, కందుకూరు సబ్ కలెక్టర్ హిమవంశీ, ఆర్డీఓలు పాల్గొన్నారు.

అనధికార కనెక్షన్లను క్రమబద్ధీకరించండి

నెల్లూరు(బారకాసు): నగరంలో తాగునీటి కుళాయి కనెక్షన్లను క్రమబద్ధీకరించి పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని కార్పొరేషన్ టీపీఆర్‌ఓ వాసుబాబు, ఇంజినీరింగ్ విభాగం ఈఈ శేషగిరిరావు వార్డు సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలో ఇంజినీరింగ్ విభాగం అధికారులు, వార్డు సచివాలయ అమెనిటీస్ కార్యదర్శులతో గురువారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. నగరంలో అన్ని గృహాలకు తాగునీటి కనెక్షన్ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పన్ను పరిధిలోకి రాకుండా అక్రమంగా వాడుతున్న కుళాయిలను గుర్తించి పన్నులు నమోదు చేయాలన్నారు. ఇంజజినీరింగ్ విభాగం డీఈఈ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ నివారణే ధ్యేయంగా కృషి

నెల్లూరు(అర్బన్): జిల్లాలో క్షయ నివారణే ధ్యేయంగా వైద్యశాఖ సిబ్బంది, డాక్టర్లు కృషి చేయాలని జిల్లా ఎయిడ్స్, టీబీ, కుష్టు నివారణాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ సూచించారు. నగరంలోని రామాలయం వీధి, రైతు బజార్ ప్రాంతాల్లో ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రాలను ఆయన గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగుల్లో ఎవరికైనా రెండు వారాలకు మించి దగ్గు ఉన్నా, గళ్ల పడుతున్నా, జ్వరం వస్తున్నా, బరువు తగ్గిపోయినా, ఆకలి మందగించిన వారికి టీబీ పరీక్షలు చేయించాలన్నారు. ప్రధానంగా గళ్ల పరీక్ష చేయించడం ద్వారా టీబీ నిర్ధారణ అవుతుందన్నారు.

పొదుపు మహిళలకు ప్రత్యేక యాప్

నెల్లూరు(పొగతోట): స్వయం సహాయక గ్రూపు మహిళలకు సంబంధించి మన డబ్బులు-మన లెక్కలు అనే నూతన యాప్‌ను సెర్ప్ అధికారులు అందుబాటులోకి తీసుకొచ్చారని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి తెలిపారు. నూతన యాప్‌కు సంబంధించి డీఆర్‌డీఏ ఉద్యోగులతో గురువారం చర్చించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ మన డబ్బులు-మన లెక్కలు నూతన యాప్‌ను జిల్లాలోని సంగం, పొదలకూరు, చేజర్ల, కొడవలూరు, కావలి మండలాల్లో యాప్‌ను పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్నామన్నారు. దీనిపై ఈనెల 30న ఏపీఎంలకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలిపారు.

మిస్‌టీన్ విజేతకు అభినందన



నెల్లూరు(బృందావనం): మిస్‌టీన్ సూపర్‌గ్లోబ్ ఇంటర్నేషనల్ విజేత నెల్లూరుకు చెందిన సయ్యద్ అన్సారీకి అన్నమయ్య సర్కిల్ వద్ద ఉన్న ఓ హోటల్‌లో అభినందన సభ నిర్వహించారు. మేయర్ స్రవంతి, జైల్ సూపరింటెండెంట్ రాజారావు, భారతి, ఇంటర్నేషనల్ కోచ్ లియాన్‌ప్రిన్స్ తదితరులు విచ్చేసి సన్మానించారు.

సంపూర్ణ అక్షరాస్యతే లక్ష్యం

నెల్లూరు(బారకాసు): నగర పరిధిలో సంపూర్ణ అక్షరాస్యతే లక్ష్యంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని కార్పొరేషన్ డిప్యూటీ డైరెక్టర్ మాధురి సచివాలయ కార్యదర్శులకు సూచించారు. అక్షరాంధ్ర కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సచివాలయ వార్డు ఉమెన్ ప్రొటెక్షన్ కార్యదర్శులు, ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెస్ కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని గురువారం నిర్వహించారు. వయోజనుల్లో నిరక్షరాస్యులను గుర్తించి చదువు నేర్పించాలన్నారు. సమావేశంలో అడల్ట్ ఎడ్యుకేషన్ నోడల్ ఆఫీసర్ మస్తాన్‌రెడ్డి, సూపర్‌వైజర్లు రాజశేఖర్, కృష్ణకిశోర్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

నెల్లూరు వాసి ఖమ్మంలో ఆత్మహత్య



మృతిచెందిన చంద్రశేఖర్‌రెడ్డి(ఫైల్)

నెల్లూరు(వీఆర్సీసెంటర్): దక్షిణ భారతదేశ కమ్యూనిస్టు యోధుడు జిల్లాకు చెందిన పుచ్చలపల్లి సుందరయ్య మేనల్లుడు(సుందరయ్య సోదరి కుమారుడు) దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి (77) అలియాస్ పాపన్న బుధవారం ఖమ్మం నగరంలోని మామిళ్లగూడెం వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. చంద్రశేఖర్‌రెడ్డి భార్య 25 ఏళ్ల క్రితం మృతిచెందింది. ఆయనకు ఇద్దరు కుమార్తెలు ఉండగా వారు అమెరికాలో స్థిరపడ్డారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ వృద్ధాశ్రమంలో ఉంటున్నారు. ఆయన హైదరాబాద్ నుంచి కాశీ వెళ్లి తిరుగు ప్రయాణంలో ఖమ్మం రైల్వేస్టేషన్‌లో రైలు దిగి కొద్దిదూరంలోని మామిళ్లగూడెం ప్రాంతంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ క్రమంలో ఆయన స్వగ్రామం ఇందుకూరుపేట మండలం పల్లిపాడులో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా ఆయన మృతిపై సీపీఎం జిల్లా, నగర కార్యదర్శులు మూలం రమేష్, కత్తి శ్రీనివాసులు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ట్రాన్స్‌కో ఈఈగా నారాయణరావు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఏపీ ట్రాన్స్-కో టౌన్ ఈఈగా బి.నారాయణరావు నియమితులయ్యారు. నరసరావుపేటలో ఈఈగా విధులు నిర్వహిస్తున్న ఆయన నెల్లూరుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన నెల్లూరులోని అంబాపురం ట్రాన్స్‌కో జిల్లా ప్రధాన కార్యాలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం నెల్లూరు డిస్కం ఈఈ శ్రీధర్, సీనియర్ అసిస్టెంట్ శివ ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు.

దీపారాధన చేస్తూ..

• గాయాలపాలైన వృద్ధురాలి మృతి

నెల్లూరు(క్రైమ్): దీపారాధన చేస్తుండగా ప్రమాదవశాత్తు గాయాలపాలైన వృద్ధురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. పోలీసుల సమాచారం మేరకు.. ఎంవీ అగ్రహారంలో సుబ్బయ్య శాస్త్రి, భాగ్యలక్ష్మ(70) దంపతులు నివాసం ఉంటున్నారు. ఈనెల 23న భాగ్యలక్ష్మి ఇంట్లో దీపారాధన చేస్తుండగా ప్రమాదశాత్తు చీరకు నిప్పంటుకుని మంటలు వ్యాపించాయి. దీంతఆమెకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చూపించారు. 24న నారాయణ హాస్పిటల్‌లో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ 26వ తేదీన మృతిచెందారు. ఈమేరకు భర్త బుధవారం చిన్నబజారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

వర్క్‌షాపు సిబ్బంది సమస్యలను పరిష్కరించాలి

నెల్లూరు (టౌన్): రాష్ట్రంలోని ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలల్లో పనిచేస్తున్న వర్క్‌షాపు సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని ఏపీ గవర్నమెంట్ పాలిటెక్నిక్ టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ పాషా, ఉపాధ్యక్షుడు శ్రీహరి కోరారు. ఈ మేరకు రాష్ట్ర సాంకేతిక విద్యా కమిషనర్ గణేష్‌కుమార్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ కొన్ని సమస్యలపై ఆయన సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. అసోసియేషన్ రాష్ట్ర నాయకులు వెంకటేశ్వరరావు, సుకీర్తి, ప్రసాద్, ఎస్వీసీ ప్రసాద్, నరేష్, నాయక్ పాల్గొన్నారు.

జలాశయాల్లో పుష్కలంగా నీరు

నెల్లూరు సిటీ: జిల్లాలో ఎన్నడూ లేనివిధంగా రెండో పంటకు నీరు ఇచ్చిన తర్వాత కూడా సుమారు వంద టీఎంసీల నీరు నిల్వ ఉందని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. సంతపేటలోని ఆయన క్యాంపు కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాతో పాటు సత్యవేడు, శ్రీకాళహస్తిని కలుపుకుని మొదటి పంటకు దాదాపు ఆరు లక్షల ఎకరాలకు నీళ్లిచ్చినట్లు చెప్పారు. అలాగే నదుల అనుసంధానికి దాదాపు రూ.84 వేల కోట్లు ఖర్చవుతుందన్నారు.

పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నెల్లూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 26 అనుబంధ విభాగాలకు అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. యూత్ వింగ్‌కు షేక్.యస్దాని, మహిళా విభాగానికి ఈదల ధనుజారెడ్డి, రైతు విభాగానికి ఆదిరెడ్డి రామచంద్రారెడ్డి, బీసీ సెల్‌కు ఉప్పల శేషగౌడ్, ఎస్సీ సెల్‌కు నవకోటి రాహుల్‌గాంధీ, ఎస్టీ సెల్‌కు మానికల సునీల్, మైనార్టీ సెల్‌కు షేక్. అబ్దుల్ మస్తాన్, క్రిస్టియన్ మైనార్టీ సెల్‌కు చింతలపూడి సులోచనమ్మ, స్టూడెంట్ వింగ్‌కు మహ్మద్ తాఫిక్ అహ్మద్, మున్సిపల్ విభాగానికి సూరి నాగేశ్వరి, ఆర్టీఐ వింగ్‌కు కాయల వరప్రసాద్, వలంటీర్ల వింగ్‌కు అరవ ప్రమీల, గ్రీవెన్స్ సెల్‌కు ముక్కంటి కిరణ్, వాణిజ్య విభాగానికి జమిలి శ్రీనివాసరావు, వీవర్స్ వింగ్‌కు దుద్దుకూరు రాజ్‌కుమార్, ఇంటెలెక్చువల్ ఫోరమ్‌కు పొన్నం సుమధర్, వైఎస్సార్ టీయూసీకు కత్తి పరంధామయ్య, అంగన్‌వాడీ వింగ్‌కు సయ్యద్ రమిజ, లీగల్ సెల్‌కు తిరుమూరు మునికుమార్, కల్చరల్ వింగ్‌కు పిన్నం రాజు శివనాగప్రసాద్, సోషల్ మీడియాకు షేక్.ఉస్మాన్, ఐటీ వింగ్‌కు అములూరు ప్రసన్నకుమార్‌నాయుడు, దివ్యాంగుల విభాగానికి షేక్ సుభానిబాషా, డాక్టర్ వింగ్‌కు ఎల్లా శ్రీహరిరెడ్డి, బూత్ కమిటీకి సింగంశెట్టి అశోక్, పబ్లిసిటీ వింగ్‌కు నెల్లూరు వెంకటసుబ్బయ్యలను నియమించారు.

రౌడీషీటర్లపై ఉక్కుపాదం మోపండి

• రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న డీజీపీ

నెల్లూరు(క్రైమ్): రౌడీల విషయంలో ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా ఉక్కుపాదం మోపాలని రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా పోలీసు అధికారులను ఆదేశించారు. ఆయన తిరుపతికి వెళ్తూ మార్గమధ్యలో నెల్లూరుకు విచ్చేసి జిల్లా పోలీసు కార్యాలయం మినీకాన్ఫరెన్స్ హాల్లో డీఎస్పీలు, నగర సీఐలతో నేర సమీక్షను గురువారం నిర్వహించారు. ఇటీవల జిల్లాలో చోటుచేసుకున్న పరిణామాలు, నేరాల కట్టడికి తీసుకుంటున్న చర్యలు, రౌడీషీటర్లు ఎంత మంది ఉన్నారు? వారిలో యాక్టివ్ రౌడీషీటర్లు ఎంతమంది ఇలా అన్ని వివరాలు సేకరించారు. నేరాలను కట్టడి చేసి ప్రజలకు మెరుగైన శాంతిభద్రతలు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే రౌడీలు, ట్రబుల్ మాంగర్స్‌ను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించరాదని, వారి పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. లోక్‌అదాలత్‌లో అత్యధిక కేసుల పరిష్కారించడంలో, మిస్సింగ్ కేసుల ఛేదనలో రాష్ట్రంలోనే జిల్లా ముందంజలో ఉండడం అభినందనీయమన్నారు. గత కొద్దిరోజులుగా రాష్ట్రాన్ని కుదిపేస్తున్న శ్రీకాంత్, అతని స్నేహితురాలి వ్యవహారంపై చర్చించి ఇందులో ప్రమేయం ఉన్న ప్రతిఒక్కరిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీకి సూచించినట్లు సమాచారం. సమావేశంలో గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్, ఏఎస్పీ సౌజన్య పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలను సహించేది లేదు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ఇష్టమొచ్చినట్లు మాట్లాడడాన్ని వైఎస్సార్‌సీపీ నేతలు తీవ్రంగా ఖండించారు. అధికారం ఉంది కదా అని వైఎస్సార్‌సీపీ నేతలపై నోరుపారేసుకుంటే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు వారు విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు.

కావ్య అక్రమాలు అందరికీ తెలుసు



మాట్లాడుతున్న ఆశ్రిత్‌రెడ్డి

నీతిమంతుడు అని చెప్పుకునే ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి అక్రమాలు అందరికీ తెలుసునని పార్టీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు ఆశ్రిత్‌రెడ్డి అన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. వ్యక్తిగత విమర్శలకు దూరంగా ఉంటూ హుందా రాజకీయాలు చేస్తూ ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న తమ నాయకుడిని విమర్శించడం దారుణమన్నారు. చౌకబారు విమర్శలు చేస్తూ ప్రజల మధ్య తగాదాలు, ధనార్జనే ధ్యేయంగా పనిచేసే కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డికి ప్రజలు త్వరలో బుద్ధి చెబుతారన్నారు.

పెద్ద దొంగ కావ్య కృష్ణారెడ్డి – సమీర్‌ఖాన్

రాజకీయ నేతల్లోనే పెద్ద దొంగ కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి అని, ఆయనే ఇతర నాయకులను విమర్శించడం సిగ్గుచేటని పార్టీ మేధావుల ఫోరమ్ రాష్ట్ర అధికార ప్రతినిధి సమీర్‌ఖాన్ అన్నారు. జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డిపై కావ్య కృష్ణారెడ్డి చేసిన వ్యాఖ్యలు ఆయన చౌకబారుతనాన్ని తెలియజేస్తున్నాయన్నారు. నీచమైన బాషతో ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఎంత వరకు సమంజసమన్నారు.

అధికార మదం – పేర్నేటి కోటేశ్వరరెడ్డి

అధికార మదంతో ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి చేసే వ్యాఖ్యలు మహిళలు సైతం అసహ్యించుకుంటున్నారని పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పేర్నేటి కోటేశ్వరరెడ్డి అన్నారు. జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిపై అక్రమ కేసు నమోదు చేస్తే వాస్తవాలు తెలిపేందుకు వచ్చిన పార్టీ నాయకులపై వ్యక్తిగత దూషణలు చేయడం సిగ్గుచేటన్నారు. కావ్య కృష్ణారెడ్డి ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత టీడీపీ నేత సుబ్బనాయుడునే మోసం చేశాడని ఆరోపించారు. అక్రమంగా మైనింగ్ చేస్తూ గ్రావెల్, ఇసుక అమ్ముకుంటూ రూ.కోట్లు స్వాహా చేస్తున్న కావ్య కృష్ణారెడ్డి నీతిమంతుడినని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు.

సభ్య సమాజం తలదించుకుంటోంది – చీదెళ్ల కిషన్

తమ నాయకులపై కావ్య కృష్ణారెడ్డి చేసిన వ్యాఖ్యలతో సభ్య సమాజం తలదించుకుంటోందని పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి చీదెళ్ల కిషన్ అన్నారు. జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కావలిలో అకృత్యాలకు తెగబడుతూ అవినీతి భాగోతం ఎక్కడ బయటపడుతుందోనన్న భయంతో కావ్య చిల్లర వ్యాఖ్యలు చేశాడని మండిపడ్డారు. మగతనం గురించి జబ్బలు చరుచుకుని మాట్లాడడం సరైన పద్ధతి కాదన్నారు. మరోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే కార్యకర్తలే సమాధానం చెబుతారన్నారు. యువజన విభాగం నేత దీపు పాల్గొన్నారు.

జుగుప్సాకరం

ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి చేసిన వ్యాఖ్యలు జుగుప్సాకరమని పార్టీ మహిళా నేతలు బెల్లంకొండ వాణి, రమీజ, పార్వతి అన్నారు. జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లో వ్యక్తిగత విమర్శలకు దూరంగా ఉండే నాయకులపై కావ్య కృష్ణారెడ్డి చేసిన వ్యాఖ్యలతో ప్రజలందరూ అసహ్యించుకుంటున్నారన్నారు. ఆయనకు కావలి ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు.

సిగ్గుచేటు – అబ్దుల్ మస్తాన్

కాకాణి, పర్వతరెడ్డిపై కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటు అని వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకుడు అబ్దుల్ మస్తాన్ హెచ్చరించారు. కోటమిట్టలో ఆయన బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. సమస్యలపై న్యాయం చేయమని స్థానిక ప్రజలు ఆ ఎమ్మెల్యే దగ్గరకు వెళ్తే వారిని ఇష్టమొచ్చినట్లు తిట్టి పంపించిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. నిజాయితీగా ప్రజలకు సేవలందించకుండా మరోసారి అలా మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు.

ఆ వ్యాఖ్యలు వెనక్కు తీసుకో..

కావ్య కృష్ణారెడ్డి.. మా నాయకులపై నువ్వు చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని 53వ డివిజన్ ఇన్‌చార్జి వెంగళరెడ్డి అన్నారు. ఆ డివిజన్‌లో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఒక ఎమ్మెల్యేగా ఉండి ఎమ్మెల్సీ పర్వతరెడ్డిని అవహేళన చేస్తూ మాట్లాడడం సంస్కారం కాదన్నారు. రెడ్‌క్రాస్ సంస్థకు చైర్మన్‌గా కరోనా సమయంలో పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఎలాంటి సేవలందించారో జిల్లా మొత్తానికి తెలుసన్నారు. డివిజన్ కో-ఆర్డినేటర్ పరంధామయ్య మాట్లాడుతూ హుందా రాజకీయాలు చేయాలని, కావలి ఎమ్మెల్యే వ్యాఖ్యలను యావత్ జిల్లా ఖండిస్తోందన్నారు.

బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లో ఉంది

కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డికి బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉందని పార్టీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సిద్దిఖ్ అన్నారు. నగర నియోజకవర్గ కార్యాలయంలో మహిళా నేత బెల్లంకొండ వాణితో కలిసి విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో మచ్చలేని నాయకుడిగా ఉన్న పర్వతరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలను సహించేది లేదన్నారు. మహిళా నేత బెల్లంకొండ వాణి మాట్లాడుతూ ఎమ్మెల్యేగా ఉండి దిగజారుడు మాటలు అసహ్యంగా ఉందన్నారు. కావలి నియోజకవర్గం ఎవరబ్బ జాగీరు కాదన్నారు. పార్టీ నేతలు అస్లాం, నాగేంద్ర, సురేష్ పాల్గొన్నారు.

చోరీ కేసులో నలుగురి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): మోపెడ్ చోరీ కేసులో నలుగురు నిందితులను పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. ఈ మేరకు చిన్నబజార్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై రజాక్ నిందితుల వివరాలను వెల్లడించారు. సంతపేటకు చెందిన రామకృష్ణ గతేడాది నవంబర్‌లో వీఆర్సీ సెంటర్‌కు వెళ్లారు. అక్కడ తన టీవీఎస్ ఎక్స్‌ఎల్ మోపెడ్‌ను పార్క్‌చేసి ఉండగా గుర్తుతెలియని దుండగులు అపహరించుకుని వెళ్లారు. బాధితుని ఫిర్యాదు మేరకు చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు ఆదేశాల మేరకు ఎస్సై అబ్దుల్ రజాక్ తన సిబ్బందితో కలిసి గురువారం ఎస్-2 రోడ్డులో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో తిరుపతి జిల్లా సూళ్లూరుపేటకు చెందిన వంశీ, మహేంద్ర, తిరుపతికి చెందిన జగన్, చిలమత్తూరుకు చెందిన చంద్రమోహన్‌లు అనుమానాస్పదంగా ఉండగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి ఓ కత్తిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించగా మోపెడ్‌ను దొంగలించినట్లు, ఎస్-2 రోడ్డులో వెళ్లేవారిని కత్తితో బెదిరించి నగదు దోచుకెళ్లేందుకు వచ్చినట్లు వెల్లడించారు. దీంతో నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి మోపెడ్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసిన సిబ్బందిని నగర డీఎస్పీ పి.సింధుప్రియ అభినందించారు.

చంద్రబాబు పైశాచికత్వానికి పాతికేళ్లు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): 2000వ సంవత్సరం ఆగస్టు 28న హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో చంద్రబాబు చేసిన పైశాచికత్వానికి 25 ఏళ్లు గడిచిందని, దీని గురించి ఇప్పుడు ఆలోచించినా రక్తం మరుగుతోందని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం అన్నారు. ఈ మేరకు నగరంలోని వీఆర్సీ మైదానం నుంచి వామపక్షాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రతిజ్ఞా దినం చేశారు. ఈ సందర్భంగా విఠపు బాలసుబ్రహ్మణ్యంతో పాటు సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల నాగేంద్రసాయి బషీర్‌బాగ్ ఘటనలో అమరులైన రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామిలకు జోహార్లు పలికారు. విద్యుత్ సంస్కరణలపై 2000లో చేపట్టిన ధర్నాకు లక్షలాది మంది ప్రజలు తరలిరావడంతో దీనిని భగ్నం చేసేందుకు పోలీసుల చర్యలతో ఆందోళనకారుల్లో ముగ్గురు చనిపోయారని, నాటి ఘటనతో చంద్రబాబు అధికారం కోల్పోయాడన్నారు.

బొబ్బల కుటుంబీకులకు పరామర్శ



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగరాధ్యక్షుడు, 37వ డివిజన్ కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్‌యాదవ్ కుటుంబసభ్యులను పార్టీ నేతలు గురువారం పరామర్శించారు. ఓల్డ్ మిలటరీ కాలనీలోని ఆయన నివాసానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయ్ కుమార్‌రెడ్డి వెళ్లారు. అక్రమ కేసులో బొబ్బల శ్రీనివాస్‌యాదవ్‌ను ఇరికించడంతో పాటు ఆయన ఆచూకీ చెప్పాలంటూ వారి ఇంటికెళ్లి కుటుంబసభ్యులను అనేక రకాలుగా ఇబ్బందులు పెడుతూ అభ్యంతరకరంగా మాట్లాడుతున్న క్రమంలో వారికి ధైర్యం చెప్పారు. పోలీస్ అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై ఆరాతీశారు.

ఐఎఫ్‌ఎస్ అధికారి, తల్లిపై దాడి

నెల్లూరు(క్రైమ్): ఐఎఫ్ఎస్ అధికారి, అతని తల్లిపై కేర్‌టేకర్ దాడి చేసిన ఘటనపై వేదాయపాళెం పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. బీవీనగర్‌లో ఐఎఫ్‌ఎస్ అధికారి బుడిగి శ్రీనివాసులు తల్లి, ఇద్దరు పిల్లలు నివాసం ఉంటున్నారు. ఆయన ప్రస్తుతం మయన్మార్‌లోని భారత రాయబార కార్యాలయంలో ఎఫ్‌ఎస్‌ఆర్‌ఆర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన తల్లి, పిల్లలకు కేర్ టేకర్‌గా రేణుక అనే మహిళ కొంతకాలంగా పనిచేస్తున్నారు. ఆయన లీవ్‌పై 27న ఇంటికి వచ్చారు. ఈక్రమంలో కేర్ టేకర్ ఇంట్లోకి చొరబడి ఇనుపరాడ్డుతో శ్రీనివాసులు, అతని తల్లిపై దాడి చేసింది. అక్కడే ఉన్న ఆయన మేనల్లుడు వెంకటేశ్వర్‌రెడ్డి ఆమె నుంచి వారిని కాపాడి ఇంట్లోకి తీసుకెళ్లారు. జరిగిన విషయాన్ని బాధితుడు వేదాయపాళెం పోలీసులకు ఫోన్‌లో తెలియజేశారు. పోలీసులు రావడాన్ని గమనించిన కేర్‌టేకర్ అక్కడి నుంచి పరారైంది. మా ఆస్తులను కాజేయాలనే ఉద్దేశంతో మాపై హత్యాయత్నం చేసిన రేణుక, ఆమెను ప్రోత్సహిస్తున్న వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గురువారం బుడిగి శ్రీనివాసులు వేదాయపాళెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.